ఇంటింటా భగీరథ నీరు అందుతోంది



ఓదెల: గుంపులలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

- పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్ రెడ్డి

ఓదెల: సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి పనులు ముమ్మరం అయ్యాయని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గుంపుల, బీమారిపల్లె, కొమిర, నాంసానిపల్లె, గోపరపల్లె, హరిపురం గ్రామాల్లో ప్రచారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా ఇంటింటా మంచినీరు అందుతోందన్నారు. పెద్దపల్లి మార్కెట్ వైస్‌చైర్మన్ ఐరెడ్డి వెంకటరెడ్డి, ఓదెల జెడ్పీటీసీ గంట రాములుయాదవ్, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కునారపు రేణుకదేవి, సర్పంచులు చిరంజీవి, ఒజ్జ సునీత, కల్లెపల్లి సరిత, పోతుగంటి రమ, కర్క మల్లారెడ్డి, గుండేటి మధు, ఎంపీటీసీ ఐరెడ్డి సరోజన, రైతు సమన్వయ జిల్లా డైరెక్టర్ పాలపల్లి బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

ఓదెల మండలం గుంపుల, బీమారిపల్లె, నాంసానిపల్లె, కొమిర గ్రామాల్లో ఆయా పార్టీల నుంచి పలువురు నాయకులు ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

దాసరి మనోహర్‌రెడ్డిని గెలిపించాలి

జూలపల్లి: గడపగడపకూ సంక్షేమ పథకాలు అందించిన బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ కోరారు. మండలంలోని పెద్దాపూర్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి మద్దతుగా గ్రామ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. గ్రామాఅధ్యక్షుడు గంగ య్యా, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, అంజయ్య, లింగయ్య, వెంకటేశ్, అరుణ్, జేకేయాదవ్ పాల్గొన్నారు.



ఎలిగేడు మండలం ధూళికట్టలో..

ఇంటింటా ప్రచారం

ఎలిగేడు: పెద్దపల్లి ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ గురువారం మండల కేంద్రం తోపాటు ధూళికట్ట, ముప్పిరితోట, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేశారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రేణుక, ఎంపీపీ స్రవంతి, పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, రైతు సమన్వ య సమితి మండల కోఆర్డినేటర్ సుధాకర్‌రావు, నాయకులు కొమురయ్య, తిరుపతిరెడ్డి, ప్రవీణ్, వినోద్, రాయనర్సయ్య, మోహన్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు వేసి అండగా నిలవాలి



సుల్తానాబాద్‌రూరల్: ప్రచారం చేస్తున్న చింతకుంట విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్‌కు ఓటిచ్చి అండగా నిలవాలని కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావు సతీమణి పావని అన్నారు. పట్టణంలోని 2వ వార్డులో గురువారం ఇంటింటి ప్రచారం చేశారు. కౌన్సిలర్ పస్తం హన్మంతు, నాయకులు సునీల్ గౌడ్, రవీందర్‌గౌడ్, సుమన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం

సుల్తానాబాద్‌రూరల్: కాంగ్రెస్ వస్తే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని కొదురుపాక, నారాయణపూర్, సుద్దాల గ్రామాల్లో గురువారం ఆయన ప్రచారంచ చేశారు. సర్పంచ్ సాగర్‌రావు, ప్రకాశ్‌రావు, రాజు ఉన్నారు.

విజయరమణారావుకు మద్దతుగా ప్రచారం

ఎలిగేడు: కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావును గెలిపించాలని గురువారం మండల కేంద్రం, ధూళికట్ట, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటా ప్రచారం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచులు కావేరి, సింధూజ, ఉపసర్పంచ్ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

ఎలిగేడు: బీర్‌ఎస్ నాయకులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. కాల్వశ్రీరాంపూర్ మండలం అంకంపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, సర్పంచ్ ఆకుల చిరంజీవి, నాయకులు, పెద్దపల్లి మండలం అప్పన్నపేటకు చెందిన బీజేపీ నాయకులు, సుల్తానాబాద్ మండలం భూపతిపూర్, గర్రెపల్లికి చెందిన పలువురు, ఎలిగేడు మండలం నారాయణపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఎలిగేడు మండలం శివపల్లిలో విజయరమణారావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పెద్దపల్లిరూరల్: ఇంటింటి ప్రచారంలో విజయరమణారావు సతీమణి పావని

రూ.500కే గ్యాస్ సిలిండర్

సుల్తానాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.500కే పేదలకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తామని విజయరమణారావు సతీమణి పావని అన్నారు. పట్టణంలోని సుభాష్‌నగర్‌లో ఆమె ప్రచారం చేశారు. కౌన్సిలర్ ఊట్ల వరప్రదీప్, మాజీ సర్పంచులు అన్నయ్యగౌడ్, దామోదర్‌రావు, కుమార్, కిషోర్, జగన్ పాల్గొన్నారు.

జూలపల్లి: మండలంలోని బాలరాజుపల్లెలో కాంగ్రెస్ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే విజయరమణరావుకు మద్దతుగా ప్రచారం చేశారు.

మెరుగైన విద్య, వైద్యం అందిస్తాం



పచారం చేస్తున్న చంద్రుపట్ల సునీల్‌రెడ్డి

మంథని: మంథని నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన విద్య, వైద్య సౌకర్యం కల్పన లక్ష్యంగా కృషి చేస్తామని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రుపట్ల సునీల్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం ముత్తారం మండలం ఖమ్మంపల్లి, సర్వారం, ఖాజీపల్లి, లక్కారం, మచ్చుపేట, కేశనపల్లి, ముత్తారం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలకు మెరుగైన వైద్యం కోసం మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి తెస్తామన్నారు. ఉన్నత చదువుల కోసం వేరే ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే ఆ సౌకర్యం కల్పించేలా కృషి చేస్తానని చెప్పారు. అలాగే నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని కోరారు. ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బస్సు వచ్చేదాకా రోడ్డుపైనే..

- బస్‌షెల్టర్లు లేక ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- కొన్ని గ్రామాల్లో ఊరికి దూరంగా..
- ఆర్టీసీ అధికారులు స్పందించాలని మండల ప్రజల డిమాండ్

ఓదెల: గ్రామాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి బస్‌షెల్టర్లు లేకపోవడంతో గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలోని పలు గ్రామాల్లో ప్రయాణికులు కూర్చోవడానికి బస్‌షెల్టర్లు లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

ఓదెలలో ఊరికి దూరంగా బస్‌స్టాండ్

మండలంలోని పొత్కపల్లి, కొలనూర్, ఓదెల, గుంపుల, కనగర్తి గ్రామాల్లో బస్‌స్టాండు కూడళ్లవద్ద బస్‌షెల్టర్ల నిర్మాణం లేకపోవటంతో ప్రయాణికులు ఎండలో నిరీక్షిస్తున్నారు. మండల కేంద్రం ఓదెలలో బస్‌స్టాండు ఊరికి దూరంగా ఏర్పాటు చేయడంతో నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం అది పశువులకు నిలయంగా మారింది. ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులు, విద్యార్థులు ఓదెల నుంచి బస్సుల ద్వారా సుల్తానాబాద్, జమ్మికుంట వైపునకు వెళ్తుంటారు. ప్రస్తుతం ఎలాంటి బస్‌షెల్టర్ లేనందున ఓదెల ఎస్సారెస్పీ కాలువ పక్కనే వేచి ఉండాల్సిన పరిస్థితి.



పొత్కపల్లిలో బస్‌షెల్టర్ లేకపోవడంతో ఎండలో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

నిలువ నీడ లేదు..

మండల కార్యాలయాలకు వచ్చిపోయే సిబ్బందికి సైతం ఎలాంటి షెల్టర్ లేనందున రోడ్డుపైనే నిలబడి ఉంటూ బస్సుకోసం ఎదురుచూస్తున్నారు. పొత్కపల్లి నుంచి ఇందుర్తి, శానగొండ, గుంపుల, జమ్మికుంట వరకు ప్రజలు ప్రయాణిస్తుంటారు. రైల్వేగేట్ పక్కన రోడ్డుపైన బస్సులు వచ్చేంతవరకు ప్రయాణికులు గ్రామస్తులు నిరీక్షిస్తున్నారు. కొలనూర్ రైల్వేగేట్ సమీపంలో రైళ్ల నుంచి దిగిన ప్రయాణికులకు ఎలాంటి నీడ సౌకర్యం లేదు. బస్‌స్టాండు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. కనగర్తి, గుండ్లపల్లెలో సైతం ప్రధానరోడ్డుపైనే నిరీక్షిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు బస్‌షెల్టర్లు నిర్మించాలని కోరుతున్నారు.

నిలువ నీడ లేదు



పొత్కపల్లిలో బస్టాండు లేనందున ఇందుర్తికి బస్సు వచ్చేంతవరకు రోడ్డుపైననే ఉంటున్నా. ఎండకు ఎండుతూ వర్షంలో తడుస్తూ ప్రయాణం చేస్తున్నాం. కనీసం మానవత్వంతో అధికారులు స్పందించి ప్రయాణికులకు నీడ సౌకర్యం కల్పించాలి.

– అల్లంనేని రాజేశ్వరి, ఇందుర్తి

బస్‌స్టాండ్‌లు నిర్మించండి



మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రధానరోడ్లపైన ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్‌లు నిర్మించాలి. ప్రస్తుతం గంటల తరబడి బస్సులు ఆలస్యంగా రావడంతో నీడసౌకర్యం లేనందున ఇబ్బంది పడుతున్నాం. వెంటనే స్పందించి షెల్టర్లు నిర్మించాలి.

– బండారి రాజయ్య, గుంపుల

అధికారులు స్పందించాలి



పొత్కపల్లి నుంచి సుల్తానాబాద్, జమ్మికుంట వైపునకు ప్రయాణికులు బస్సులు, ప్రయివేట్ వాహనాల్లో ప్రయాణిస్తుంటారు. నిలువ నీడలేక పోవడంతో ఇబ్బంది పడుతున్నారు. వెంటనే ఆర్టీసీ అధికారులు పట్టించుకొని బస్‌షెల్టర్లు నిర్మించాలి.

– గజ్జెల్లి సదానందం, పొత్కపల్లి

కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దు



కొప్పుల ఈశ్వర్‌కు తిలకం దిద్దుతున్న మహిళలు

పెగడపల్లి: కాంగ్రెస్ నాయకులు చెప్పే మాటలు నమ్మి వారికి అధికారం అప్పగిస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందని మంత్రి ఈశ్వర్ అన్నారు. పెగడపల్లి మండలంలోని రాములపల్లి, వెంగళాయిపేట, లింగాపూర్, శాలపల్లి గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ మంత్రి రాజేశంగౌడ్, ఎంపీపీ శోభ, సర్పంచులు గంగాభవాని, సులోచన, తార, విండో చైర్మన్లు రమణారావు, వేణుగోపాల్, వైస్ ఎంపీపీ గంగాధర్, ఏఎంసీ వైస్ చైర్మన్ అంజి పాల్గొన్నారు.

ధర్మపురి: ఎన్నారై బీఆర్‌ఎస్ వ్యవస్థాపకుడు కూర్మాచలం అనిల్ ధర్మపురి పట్టణంలో గురువారం మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు మద్దతు పలకాలన్నారు. పలువురు ఎన్నారై నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పథకాల్లో ఆదర్శం

బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్లో రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్, ముఖ్య సలహాదారు రావుల అంజయ్య అన్నారు. మాలల సమస్యలు పరిష్కరిస్తామని హామీఇచ్చిన బీఆర్‌ఎస్ పార్టీకే మాలల సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

ఉచిత విద్యుత్ ఘనత కాంగ్రెస్ పార్టీదే



లక్ష్మణ్‌కుమార్‌కు తిలకం దిద్దుతున్న మహిళ

వెల్గటూర్: రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఎండపల్లి మండలం కొండాపూర్, ఎండపల్లి, అంబరిపేట, పాతగూడూర్ గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. 24 గంటల విద్యుత్ పేరుతో బీఆర్‌ఎస్ ప్రజలను మోసం చేస్తోందని, అసలు రైతులకు ఉచిత విద్యుత్ పథకాన్ని సీఎం వైఎస్‌ఆర్ ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేవలం బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు తప్ప ఎవరికీ మేలు జరగలేదని ఆరోపించారు. సంక్షేల పథకాల అమలులో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో వెల్గ టూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, ఎండపల్లి ఎంపీటీసీ బషీర్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షుడిగా దేవేందర్‌రావు



సుల్తానాబాద్: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షుడిగా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి ఉపాధ్యాయుడు గంద్ర దేవేందర్ రావును జిల్లా అధ్యక్షుడు మెరుగు సతీశ్, ప్రధాన కార్యదర్శి మందలశ్రీకాంత్‌రెడ్డి ప్రకటించారు. సుల్తానాబాద్ మండలం నుంచి రాష్ట్ర కమిటీ సభ్యుడిగా మడ్డి కొమురయ్య, జిల్లా ఉపాధ్యక్షులుగా కొంతం అనిల్, ఫయాజుద్దీన్, జిల్లా కార్యదర్శిగా టంగుటూరి దేవేందర్, జిల్లా కార్యదర్శి వడ్లూరి రమేశ్‌ను నియమించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. సుల్తానాబాద్ ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా దాతు సదానందం, ప్రధాన కార్యదర్శిగా వడ్లూరి శ్యాంసుందర్‌ను ప్రకటించారు.

క్లుప్తంగా

ప్రజలకు నీటి ఇబ్బందులు కలుగకుండా చూస్తాం



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

సుల్తానాబాద్: ప్రజలకు నీటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ అన్నారు. పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న ఎస్సారెస్పీ క్వార్టర్స్ వెనుక వైపు పైప్‌లైన్ పగిలి నీళ్లు వెళ్లకపోవడంతో కాలనీవాసులు ఎన్నికలను బహిష్కరిస్తామని తహసీల్దార్‌కు బుధవారం ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. గురువారం మున్సిపల్ కమిషనర్ సిబ్బందితో కలిసి జేసీబీ సహకారంతో లీకేజీ అయిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్నామని, వెంటనే మరమ్మతు చేపట్టామని వివరించారు. అప్పటి వరకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్యాంకర్ ద్వారా నిత్యం వాటర్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

ఎలిగేడు: ఎలిగేడు మండల కేంద్రంలోని శ్రీసాయిబాబా ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, హారతి వంటి ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కట్ల మురళి, స్వర్ణ దంపతులు, ఆలయ ప్రధాన అర్చకులు సుజిత్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.



ఉపకాలువలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

సుల్తానాబాద్: యాసంగి సీజన్‌కు డి-86 కాలువలకు ఉపకాలువలుగా ఉన్న వాటి ద్వారా వ్యవసాయం కోసం నీటిని ఉపయోగిస్తారు. సుల్తానాబాద్ పట్టణంలోని సుగ్లాంపల్లి ఉపకాలువ వివిధ రకాల పిచ్చి మొక్కలతోపాటు కాలువ పూర్తిగా మట్టితో కూడుకుపోయింది. చివరి ప్రాంతానికి కాలువ నీరు చేరకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా వెంటనే పిచ్చిమొక్కలు, మట్టిని తొలగించాలని రైతులు కోరుతున్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సంఘం నాయకులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లోని శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో కమ్యూనిటీ భవనం, కల్యాణ మండప నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు యాంసాని రాఘవులు, ప్రధాన కార్యదర్శి కోలేటి అశోక్, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజయ్య



ఎస్పీ రాజయ్య

సుల్తానాబాద్: కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఓదెల మండలం కొలనూర్ గ్రామానికి చెందిన ఎస్పీ రాజయ్యగౌడ్‌ను నియమించారు. డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేయగా పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు గురువారం నియామక పత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు, పీసీసీ ఉపాధ్యక్షుడు, ప్రచార కార్యదర్శి భూషణవేణి రమేశ్ గౌడ్‌కు రాజయ్య కృతజ్ఞతలు తెలిపారు.



ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇవ్వరా!

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎదుట ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన అధికారులు దానికి కనెక్షన్ ఇవ్వడం మర్చినట్టున్నారు. నెలల తరబడి ట్రాన్స్‌ఫార్మర్ ఇలా కనెక్షన్ కోసం నిరీక్షిస్తోంది. గద్దె నిర్మించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన అధికారులు కనెక్షన్ ఇచ్చి వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా లక్ష్మీపతిగౌడ్



లక్ష్మీపతిగౌడ్



పవన్

గోదావరిఖని: కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా వంగ లక్ష్మీపతిగౌడ్‌ను నియమించారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ నియామకపత్రం అందజేశారు. అలాగే పార్టీ కార్యదర్శిగా గోదావరిఖనికి చెందిన తాళ్లూర్ పవన్‌కుమార్‌ను నియమించారు.

మాదిగ లాయర్ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక



వెంకటేశ్వర్లు



మనోహర్

గోదావరిఖనిటౌన్: మాదిగ లాయర్ ఫెడరేషన్ నూతన కమిటీని గురువారం స్థానిక గంగానగర్‌లోని లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జూపాక వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా ఆసంపల్లి రవికుమార్, దూడపాక లింగస్వామి, గజ్జల ప్రసన్న, రామగిరి విక్రమ్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా పెరక మనోహర్, సంయుక్త కార్యదర్శులుగా కాంపెల్లి లక్ష్మీనారాయణ, ఇరుగురాల సంతోష్, ఎల్కతుర్తి శోభారాణి, మిడిదొడ్డి వరలక్ష్మి, ఈదునూరి జానకి, కోశాధికారిగా పులిపాక ప్రవీణ్‌కుమార్, ప్రచార కార్యదర్శులుగా గాజుల రాజ్‌కుమార్, కాదాసి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులుగా గిరిగిరి చందర్, మాట్ల భానుకృష్ణ, జ్యోతిప్రియదర్శిని, ఇరికిల్ల స్రవంతి, జ్యోతిని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం



రోడ్డుపై అడ్డంగా ఉన్న పశువులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ చౌరస్తాలో ప్రతీరోజు పదుల సంఖ్యలో పశువులు రోడ్లపై సంచరించడంతో రాత్రివేళల్లో వాటిని గమనించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి రోడ్డుపై సంచరిస్తున్న పశువులను కార్పొరేషన్ బంజరు దొడ్డికి తరలించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.